శారద

ఆనందకృష్ణ

డాక్టరుగా ఎంతోమందికి టి. బి. నయం చేశాడు మూర్తి. మంచివాడని, కుర్రాడయినా హస్తవాసి మంచిదని అందరికి అతనంటే అదో విధమైన గౌరవం — అతనంటే మంచి వైద్యుడిగా నమ్మకం............... ముభావమైన మనిషి. కోపం ఎరగని డాక్టరు. మరొకరి బాధను అర్థం చేసుకోడానికి ప్రయత్నం చేసే మనిషి — అయితే అతని పనేమిటో అతనేమిటో — అంతే. 'ఒక్క సంవత్సరంలో ఎంతమార్పు — చలాకీగా కబుర్లు చెబుతూ నవ్వుతూ, నవ్విస్తూ, కనిపించే మూర్తి ఇలా అయిపోయాడేమిటి !' అన్పిస్తుంది. అతనిని తెలిసిన వాళ్ళకి .... అతనిలో ఈ మార్పుకు కారణం తెలిసిన వాళ్ళు అతని మీద సానుభూతి చూపించడం తప్ప మరేం చెయ్యగలరు ....

"డాక్టరు మూర్తి" ..... పిలిచారు డాక్టరు శేషగిరి. మూర్తి రావడంతోనే "చూడు మూర్తి ... ఈమెను నువ్వు కూడా పరీక్ష చేసి ఎక్సరే తియ్యి..." అతనితో అని 'మీరు ఆయనతో వెళ్ళండి' అని ఆమెను — కూడా వచ్చిన ఆమె తండ్రినీ అతనితో పంపించాడు డాక్టరు శేషగిరి....

ఆమెను పరీక్ష చెయ్యడం ఇంచుమించు పూర్తయింది. మధ్య మధ్యలో అతని ప్రశ్నలు — ఆమె జవాబులూ —

ఎక్సరే తియ్యడానికి ముందర వివరాలు తీసుకుంటూ "మీ పేరు ?"

"శారద"

ఆ పేరు వినగానే మూర్తిలో ఏదో చలనం — ఏదో అనుమానం — అంతవరకూ ఆమె ముఖమైనా సరిగ్గా చూడని మూర్తి ఆమె వైపు చూశాడు. అవే కళ్ళు — అదే రూపం — ఎంత పోలిక ! — తన శారదే !! — అనుమానం లేదు — అతని కళ్ళల్లో అదో విధమైన ఆనందం — అంతలోనే వోబాధ — ఆ ఆనందం బాధా అతనిలోనే దాచుకున్నాడు మూర్తి.

* * *

"డాక్టర్ టి. బి. యేనా ! ?" బాధగా, అమాయకంగా ప్రశ్నించింది శారద.

మూర్తి తన నోటితో టి. బి. అని చెప్పలేక పోయాడు.

"టి. బి. అని ఎవరు చెప్పారు మీకు ! ?" "లేకపోతే నన్ను ఈ శానిటోరియంలో ఎందుకు చేరుస్తారు. నిజం దాయవలసిన అవుసరం లేదు డాక్టర్. చెప్పండి."

"చిన్న అనుమానం — అంతకుమించి మరేం లేదు."

ఆమె మొహంలో మార్పు — ఆందోళన — మూర్తి అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

* * *

ఆ రోజు రాత్రి అస్పత్రిలో పేషెంట్స్‌ను చూస్తున్నాడు.... .... రాత్రి పదకొండు గంటలు దాటినా శారద స్పెషల్ రూమ్‌లో ఇంకా లైటు వెలుగుతూనే వుండడం మూర్తికి ఆశ్చర్యం కలిగించింది.

మెల్లిగా ఆమె గది వైపు వెళ్ళాడు. ఆమె మంచం మీద కూర్చుని ఏవో ఆలోచిస్తోంది — చేతిలో ఏవో రెండు కాగితాలు — ఆమె కళ్ళల్లో ఆరీ ఆరని కన్నీళ్ళు —

మూర్తిని చూడగానే కన్నీళ్ళు తుడిచేసుకుంది. ఆ విషయం డాక్టరుకు తెలియకూడదనే వుద్దేశ్యంతో.

"మీరింకా నిద్ర పోలేదా — టైమ్ ఎంతయ్యిందో తెలుసా ! ?"

మూర్తి ప్రశ్నకు శారద జవాబేం చెప్పలేదు. రెండు క్షణాలు నిశ్శబ్దం.

"డాక్టర్ ...."

"వూఁ"

"ఒక్కమాట అడుగుతాను నిజం చెప్పండి — నేనింకా ఎన్నిరోజులు బ్రతుకుతాను డాక్టర్ ?" సూటిగా అడిగింది శారద.

మూర్తి ఆమె దగ్గరనుంచి అటువంటి ప్రశ్న వస్తుందనివూహించలేక పోయాడు. — ఆమె మొహం వైపు తీక్షణంగా చూశాడు.

ఆమె ముఖంలో చెప్పలేని భయం — తను ఇంక బ్రతకదేమో అన్న అనుమానం....... ఆమెకు ఎక్కువ హాని చేస్తుందేమో అన్పించింది మూర్తికి. తన శారదే ఎదురుగా వున్నట్టనిపించింది. తన శారదే అలా అడిగి వుంటే తను సహించగలిగేవాడా .... సరిగ్గా అలాగే అన్పించింది ఆ క్షణంలో కూడా.

"చూడండి శారదా ...... టి. బి. ని జబ్బు కింద చూడవలసిన రోజులు ఎప్పుడో పోయాయి. — మామూలు జ్వరం కంటే సులభంగా నయమవుతోంది. — చదువుకున్నవారు ...... మీరే ఇలా అధైర్య పడితే ఎలాగ చెప్పండి ..... మా మాట నమ్మండి. మీకు వచ్చినది టి. బి. కాదని అబద్ధం చెప్పను. అయితే అది అతి ప్రారంభ దశలో వుంది. ముందు జాగ్రత్త కోసం ఇక్కడే జేర్పించమని మీ నాన్నగారికి సలహా ఇచ్చాం. అంతకు మించి మరేం లేదు......... మీకుఇప్పుడు కావలసినవది విశ్రాంతి — భయం అనవసరం ...."

"మరో విషయం శారదా — మా మాటల మీద మీకే మాత్రం నమ్మకం వున్నా ఈ విషయము కేప్టెన్‌గారికి వ్రాయకండి. ఇది డాక్టరుగా ఇస్తున్న సలహా కాదు. స్నేహితుడిగా ఇస్తున్న సలహా. మీరే ఆలోచించండి — — ఎక్కడో దూర దేశంలో వున్న ఆయన పని వత్తిడి వల్లనో, సెలవు దొరకకో రాలేకపోతే ఆయన ఎంత బాధ పడతారు—

మరో విషయం. సరిగ్గా ఇవాళ్టినుంచి రెండు

వారంలో మిమ్మల్ని ఆరోగ్యంతో ఆస్పత్రినుంచి డిస్చార్జి చేసే పూచీ నాది."

శారద అతని వైపు చూసింది. అతని మాటల్లోనూ, మొహంలోనూ, అతను చెబుతున్న ప్రతి మాటా నిజమే నన్నట్లు కన్పించింది శారదకు. మీదేం మాట్లాడ లేదు. చేతులో వున్న రెండు నీలిరంగు కాగితాలూ మరుక్షణంలో ముక్కముక్కలై పోయాయి.

" 'థాంక్యూ — " అంటూ మూర్తి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

* * *

" అమ్మాయి విషయం అల్లుడికి వ్రాయా లంటారా ! ?"

ఆయన ప్రశ్నకు " వద్దండి. ఇదేం అంత భయపడవలసిన విషయం కాని, ఆయన్ని కంగారు పెట్టవలసిన విషయం కాని కాదు, ఆమెతో కూడా అదే విషయం చెప్పాను. మీరూ మరోసారి చెప్పండి." డాక్టరు మూర్తి జవాబు.

డాక్టరు మూర్తి మాటల్లో పూర్తిగా గురి కుదిరింది శారదకు. అది మొదలు ఆమెలో చాలా మార్పు వచ్చింది. తనకేం జబ్బు లేనట్టుగానే వుండేది. డాక్టరు మూర్తికి ఆ విషయం చెప్పలేనంత సంతోషాన్నిచ్చింది. హాస్పిటల్‌లో కాలు పెట్టగానే శారద రూములోకి వెళ్ళకుండా మరో రూమ్‌కి వెళ్ళే వాడు కాదు. — ఆమెకు గుడ్‌నైట్ చెప్పందే ఇంటికి వెళ్ళేవాడు కాదు.

శారద తను టి. బి. పేషంటుని — తను వుంటూ న్నది శానిటోరియం అని మర్చిపోయేలా చేసేవాడు మూర్తి.

డాక్టరు శేషగిరి మూర్తితో వచ్చిన మార్పుకు ఎంతో ఆశ్చర్యపడ్డ మాట వాస్తవం. డాక్టరయి వుండి ఆప్తులు దూరమైతే మూర్తంత దిగులు పడిన వారిని మరెవ్వరినీ చూడలేదు ఆయన. శారద వైద్యం — మూర్తికి చాలా మేలు చేస్తోందేమో అన్పించింది ఆయనకి. సుమారు సంవత్సరం క్రితం మాయమయ్యిన మూర్తి మొహం మీది చిరు నవ్వు, మళ్ళీ కన్పిస్తోంది.........

* * *

" ప్రియమైన అన్నయ్యకు,

నీ దగ్గరనుంచి ఉత్తరం వచ్చి ఎన్నో రోజు లయ్యింది. మిలటరిలో జేరిన కొత్త రోజుల్లో వారానికో వుత్తరమైనా వ్రాసేవాడివి. దూరంగా హిమాలయాల్లో దేశ క్షేమం కోసం గస్తీ తిరిగే నీకు ఇప్పుడు ఆ తీరికా లేదేమో ! ? నెలకు ఓ వుత్తరం కూడా కరువై పోయింది. ఆపే క్షలూ, మమతలూ, అభిమానాలను పెంచుకోడం, — బహుశా మనలో వున్న బలహీనతేమో ! అనేవాడివి నువ్వు. — ఒకవేళ అవే లేకపోతే జీవితంలో ఆనందా నికి తావులేదని అనుకుంటాను........

ఇలా సాగిపోతోంది శారద చదువుతూన్న ' అన్నయ్య ' కథ.

అప్పుడే అటు వచ్చిన మూర్తితో అంది. " డాక్టర్ — ఈ కథ చూశారా ! ?"

డాక్టరు మూర్తి ఆమె చదువుతూన్న కథ వైపు చూశాడు. ఆమె ప్రశ్నకు జవాబేం చెప్పలేదు.

" డాక్టర్ — ఈ కథ వ్రాసిన ఆయన ఎప్పుడు ఒక అన్నా, ఒక చెల్లెల్ని గురించే వ్రాస్తూ వుంటాడు బహుశా ఆయనకు అంత మంచి చెల్లెలు వుండేమోనని నాకూ అన్పిస్తూ వుంటుంది ఆ రచయిత అంత మంచి అన్నయ్య వుంటే బావుండునని ...."

* * *

' నాకూ ఈ రచయిత లాటి అన్నయ్య వుంటే ఎంత బావుండేదో ' అన్న శారద మాటలకు మూర్తి అనుకున్నాడు. 'నిజంగా ఆమెకు ఓ అన్నయ్య వుంటే ఆతను శారదకు టి. బి. వచ్చి నందుకు ఎంత బాధ పడేవాడో ఆమెకేం తెలుసు,

పది రోజులలో తనకే అంత దగ్గరగా వచ్చింది. అన్నయ్య అయివుంటే అతనితో మరెంత చనువుగా వుండేదో — ఏవో జ్ఞాపకాలు మూర్తికి.

* * *

రోజులు గడుస్తున్నాయి. శారదకు బాగా నయ మయ్యింది. మరో వారం రోజుల్లో డిస్చార్జి చేస్తా

హతుని ఆప్తమిత్రుడ్నంటూ సాక్ష్యం ఇవ్వటానికి వచ్చిన వ్యక్తిని బోనులో ఎక్కించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ క్రాస్ పరీక్ష కుపక్రమించాడు.

ప. ప్రా : ఏమయ్యా హతుడు ఒంటరిగా ఉన్నప్పుడు తనలో తాను మాట్లాడు కునేవాడట నిజమేనా ?

సాక్షి : నాకు తెలీదండి !

ప. ప్రా : మరి హతుని ఆప్త మిత్రుడనని అబద్ధం చెప్పావేం ?

సాక్షి : (కోపంతో) నేను ఉన్నప్పుడు అతను ఒంటరిగా తనలో తాను ఎప్పుడూ మాట్లాడుకోలేదు.

మాధవ్ (తెనాలి)

రనగా కేప్టెన్ కృష్ణ ఆ ఊరు వచ్చాడు. శారదకు టి. బి. వచ్చినట్లు తనకు వ్రాయకపోయి నందుకు బాధ పడినా ఆమెకు పూర్తిగా నయమయ్యిందని తెలిసి చాలా సంతోషించాడు. ఆ వారం రోజుల్లో డాక్టరు మూర్తికి అతనితో పరిచయం ఎక్కువే అయ్యింది.

ఆ రోజున శారదను డిస్చార్జి చేస్తారు. ప్రొద్దుటే కృష్ణ హాస్పటల్‌కు వచ్చాడు. శారదతో కలిసి డాక్టర్ మూర్తి రూమ్‌కి వెళ్ళారు. డాక్టరు మూర్తి ఆ సమ యంలో అక్కడ కనిపించకపోవడం కొంచెం ఆశ్చర్యం గానే కన్పించింది శారదకు.

" సిస్టర్. డాక్టర్ రాలేదా ఇంకానూ."

" వచ్చారండీ — ఎక్కడికో వెళ్ళారు...... ఒకవేళ ఆయన రావడం ఆలశ్యమయితే ఈ విషయం మీతో చెప్పమన్నారు."

సిస్టర్ అన్నమాటలు శారదకు ఎంతో బాధ కలిగించాయి. ఆప్పుడిలా, చనువుగా మాట్లాడుతూ, తీరా తనకు పూర్తిగా నయమయ్యి తను వెళ్ళిపోతున్న రోజున తన గదివైపైనా రాలేదు. . . 'అతను ఎందుకు రావాలి— అతను కేవలం ఒక డాక్టరు. డాక్టరుగా తన జబ్బు నయం చేశాడు— తరువాత అతనెవరో — తనెవరో', అన్పించింది. వెంటనే డాక్టర్ మూర్తి అటు వంటి వాడు కాదు. అతను రాకపోవడానికి కారణం ఏదో ఉండి ఉంటుంది. . . . హృదయ పూర్వకంగా డాక్టరుకి కృతజ్ఞతలు చెప్పకుండా ఆమెకు వెళ్ల బుద్ధి కాలేదు.

"డాక్టరు గారు వచ్చేదాకా' ఉందామండీ" అన్న శారద మాటలకు ఆమోద సూచకంగా అక్కడే ఉన్న కుర్చీలో కూర్చున్నాడు కేప్టెన్ కృష్ణ. శారద మరో కుర్చీలో కూర్చుని డాక్టర్ మూర్తి బల్లమీద వస్తువులన్నీ చూస్తోంది. ఓ కాగితం మీద 'నా డైరీలో కొన్ని పేజీలు' 'రమేష్' అని వ్రాసి ఉంది. 'రమేష్'— అదే పేరు. తను చదివిన అన్నయ్య కథ జ్ఞాపకం వచ్చింది. శారదకు. 'రమేష్' పేరుతో కథలు వ్రాసేది డాక్టర్ మూర్తే నన్నమాట— ఏదో ఆశ్చర్యం. . . ఏదో ఆనందం.

మరేం ఆలోచించకుండా ఆ కాగితాలు తీసి చదవడం మొదలు పెట్టింది.— సగం సగం వ్రాసి ఉన్న కథ అది.— ఆ కథ పూర్తిగా ఏమిటో తెలి యక పోయినా కొన్ని తారీఖులూ ఆ రోజుల్లో తన డైరీలో అంశాలు తీసి ఉన్నట్లు ఉంది.

జనవరి, 1 : కాలచక్రంలో మరో సంవత్సరం గడిచి పోయింది. కొత్త సంవత్సరాన్ని ఉత్సాహంతో ఆహ్వానిస్తున్నారు అందరూ. . . అంతే ఈ రోజు నాకు జీవితంలో ఎప్పటికీ ఆ ఆనందాన్ని ఇవ్వ లేదేమో! ?

సరిగ్గా ఒక్క సంవత్సరం నడచి పోయింది శారద పోయి.

ఇదే సంవత్సరాది రోజున అన్నయ్యా అంటూ నా చేతుల్లోనే కళ్ళు మూసింది శారద. . . పంతొ మ్మిది సంవత్సరాలు 'అన్నయ్యా' అంటూ కూడా తిరిగిన శారదను ఒక్క సంవత్సరంలో మర్చిపోవడం అసంభవం.

ఆత్మీయతలూ, అభిమానాలు, ఆపేక్షలూ పెంచుకోవడం— అవి గాలివానకు చెట్లలా కూలి పోతుంటే— బాధ పడటం మానవుల్లో ఉన్న బలహీనతేమో ! ?—

ఫిబ్రవరి, 20 : శారద పుట్టిన రోజు ఈ రోజు బ్రతికి ఉంటే 20 సంవత్సరాలు. . . . శారదకు పుట్టిన రోజుకి టెలిగ్రాం ఇచ్చాను రెండు సంవత్సరాల క్రితం—అదే ఆమె ఆఖరిపుట్టినరోజు.

మార్చి, 15 : శారద కలలో కన్పించింది. ఏవో చెబుతోంది. విశ్వ విద్యాలయంలో తనకు నాలాటి అన్నయ్య ఉన్నందుకు ఆమె స్నేహితు లకు అసూయట.

ఏప్రిల్, 20 : ఈ రోజు శారద రూమ్‌కు 'రాధ' నన్ను చూడటానికి వచ్చింది. తన కెంతో ఆత్మీయురాలట.

* * *

అక్టోబరు, 13 : ఈ రోజు ఆస్పత్రికి ఎవరో ఒకమ్మాయి వచ్చింది. పేరు 'శారద'. పేరుతోనే

కాదు— రూపం కూడా అదే రూపం. మొహంలో అమాయకత. గొంతులో ఆత్మీయత— శారదే. సరిగ్గా సుమారు రెండు సంవత్సరాల క్రితం పోయిన చెల్లెలే ఎదురుగా వచ్చి నిల్చున్నట్లయ్యింది. పాపం టి. బి. అయితే చాలా ప్రారంభ దశలోనే ఉంది. తప్పకుండా నయమవుతుంది.

అక్టోబరు, 20 : ఎంత చనువుగా మాట్లాడుతుంది శారద. ఎదురుగా నా చెల్లెలు 'శారదే' మాట్లాడుతున్నట్టు ఉంటుంది. 'అన్నయ్యా' అని ఆమె నన్ను పిలవక పోయినా 'ఒసేయ్ శారదా' అని పిలిచేస్తానేమో అనే అనుమానం—

డాక్టరుగా ఉన్న నాకు ఇటువంటి భావాలు రావడం చాలా మందికి ఆశ్చర్యంగా ఉండొచ్చు.— డాక్టరు మాత్రం మనిషికాడా. అతనికి మాత్రం అపేక్షలుండవా ! ?

నవంబరు, 3 : నేను వ్రాసిన 'అన్నయ్య' కథ అచ్చయ్యింది.

శారద పోయిన తరువాత నేను వ్రాసిన మొదటి కథ ఇదే.—

పేషెంటు శారద నేను ఆమె గదికి వెళ్లేటప్పటికి అదే కథ చదువుతోంది.

ఆ రచయిత అంటే ఆమెకు ఇష్టమట. అలాటి అన్నయ్య ఉంటే తను ఎంతో సంతోషించేదట— ఆమెతో ఆ రచయితను నేనే అని చెప్పుకుని 'నువ్వు సరిగా నా చెల్లెలాగానే ఉన్నావు' అని చెప్పేస్తే— ఏమో!? ఏమవుతుందో.

డిశంబరు, 1 : శారదకు బాగా నయమయ్యింది. ఈ నెలాఖరులోగానే ఆమెకు డిస్చార్జ్ చెయ్యొచ్చు.

డిశంబరు, 10 : నాలో మార్పు కన్పిస్తోం

శారద

దట. నేను మునుపటి కంటే సంతోషంగానూ ఆరోగ్యంగానూ కనిపిస్తున్నానట. డాక్టర్ శేషగిరి సిస్టర్‌తో అంటున్నాడు— ఆయనకేం తెలుసు కారణం. పోయిన నా చెల్లెలు తిరిగి దొరికినంత ఆనందాన్నిచ్చింది పేషంట్‌గా వచ్చిన ఈ శారద. ఆమెకు జబ్బు నయం చెయ్యడంలో నాకేదో తృప్తి —ఆనందం!

డిశంబరు, 20 : శారదను మరో వారం పది రోజులలో ఇంటికి పంపించెయ్యొచ్చు.— ఆమెకు నా మీద ఎటు వంటి భావాలున్నాయో తెలియదు కాని—ఈశారదకు,పోయిననాశారదకు ఎంతదగ్గర....

పేషెంట్‌గా వచ్చిన ఈ శారద నాతో అంత చనువుగా ఎందుకుండాలి... ఆమెతో మాట్లాడటం నాకెంతో సంతోషంగా ఉండేది. మరో వారం రోజుల్లో ఈమె వెళ్ళిపోతుంది.

ఆమెతో చెబుదామనిపిస్తుంది.... 'నిన్ను చూసినప్పుడల్లా. నాకు నా చెల్లెలు శారదే ఎదురుగా ఉన్నట్లనిపించేది.— 'అని కాని ఎలా చెప్పడం— ఆమె భళ్ళున నవ్వుకుంటుందేమో నా వెనకాతల.

డిశంబరు, 23 : ఈ రోజు కేప్టెన్ కృష్ణ వచ్చారు..... శారద నా మాట విందన్నమాట. ఆయనకు తనకు టి. బి. వచ్చిన విషయం వ్రాయనే లేదు. తీరా ఆయన వచ్చిన సమయానికి ఆమెకు పూర్తిగా నయమయ్యింది— ఆయన చాలా మంచి వాడిలా ఉన్నాడు.

డిశంబరు, 27 : శారదను 31వ తేదీన ఇంటికి పంపించేస్తామని చెప్పారుట డాక్టర్ శేషగిరి.— ఆమె వెళ్ళిపోతూందంటే ఎందుకు నాకు ఈ బాధ—

డిశంబరు, 30: ఈరోజు కేప్టెన్‌కృష్ణతో అన్నాను.

"మీరూ, శారదా నేను జనవరి ఒకటో తారీఖున ఇచ్చే డిన్నరుకి రావాలని.— ఎందుకో ఈ శారదకు డిన్నర్ ఇద్దామనిపించింది. అందుకోసం డిన్నర్ ఎరేంజ్ చేద్దామనుకున్నాను. తీరా ఆయన 31వ తారీఖునే టిక్కెట్లు బుక్ చేసుకున్నారుట. 'సారీ' అనేశారు. జనవరి ఒకటో తారీఖున కనీసం ఈ సంవత్సరమైనా మరోలా మొదలౌతుందనుకున్నాను. అయితే జనవరి ఒకటో తారీఖు ఎప్పటికీ ఇలాగే ఉండి పోతుందేమో— అయినా వాళ్ళు నా కోసం ప్రయాణం ఎందుకు ఆపుకోవాలి ! ? నాకు ఈ శారద అంటే చెల్లెలు లాంటి అభిమానం ఏర్పడింది. ఆమెకు నా మీద అటువంటి అభిప్రాయం ఏర్పడాలని ఏముంది ? ! ఆమె దృష్టిలో డబ్బు తీసుకు జబ్బు నయం చేసే ఓ డాక్టరునే ఏమో ! ?—

ఏమయినా ఆమె వెళ్ళి పోతుందంటే బాధగానే ఉంది. రేపు ఆమె వెళ్ళిపోయే సమయానికి ఆమెకు కన్పించక పోవడం మంచిదేమో ? ?—

* * *

అసంపూర్తిగా ఆగిపోయిన ఆ కథ చదవడం పూర్తి చేసిన శారద కళ్ళు చెమ్మగిల్లాయి. ఓ దీర్ఘమైన నిట్టూర్పు—

"డాక్టరు మూర్తిగారు మనిద్దర్నీ రేపు డిన్నర్‌కి రమ్మని పిలిచారా !" అడిగింది శారద.

"అవును. మన ప్రయాణం ఇవేళే కదా. అందువల్ల రాలేనని చెప్పాను— ఏం ! ?"

'ఈ పేజీలు చదవండి మీకే తెలుస్తుంది.' అంటూ ఆ కాగితాలు కృష్ణకు అందించింది శారద.

కృష్ణ ఆ పేజీలు తిరగెయ్యడం పూర్తి చేసి— ఎదో తప్పు చేసిన వాడిలా బాధ పడ్డాడు—

"ఈయన కూడా మన కోవకు చెందినవాడేనన్నమాట.— నీకు అన్నల్లేరు. అయినా లేని అన్నలకోసం కలల్లో కూడా కలవరిస్తూ ఉంటావు. మూర్తికి ఎంతో ప్రేమతో చూసుకున్న ఒక్క చెల్లెలూ దూరమయ్యింది.— ఇప్పు డర్థమయ్యింది శారదా మూర్తి ఇంత వరకూ రాక పోవడానికి కారణం....అతని చిన్న కోరికనునేను వప్పుకోలేదు....

"కేవలం నీకు పూర్తిగా నయమయ్యిందనే సంతోషంతోనూ— మనతో ఉన్న పరిచయం వల్లా అతను డిన్నర్‌కి పిలిచాడనుకున్నాను కాని దాని వెనుక ఇంత కథ ఉందని తెలియదు శారదా నాకు— అతనికి నీ మీద అంత ఆపేక్ష, వాత్సల్యం ఉంటే — నిన్ను చూసి తన పోయిన చెల్లెలు తిరిగి దొరికినంత సంతోషిస్తుంటే ఆ ఆనందం అతనికి కాకుండా నేనెందుకు చెయ్యాలి.— లేని అన్నయ్యను వూహించుకొనే నీకు, నిన్ను చెల్లెలుగా వూహించునే ఓ అన్నయ్య దొరికాడు—

"మన ప్రయాణం వాయిదావేస్తున్నాను శారదా— నేను రిజర్వేషన్ కేన్సల్ చేస్తాను. మూర్తితో ఈ విషయం చెప్పు."

కృష్ణ మాటలు వింటూ లోపలికి వచ్చిన మూర్తి మొహంలో అద్భుతమైన ఆనందం, కళ్ళల్లో తృప్తి— రాలీ రాలని ఆనంద బాష్పాలు చూస్తూ నిల్చుండి పోయింది శారద— అతనిలో తన అన్నయ్యను చూసుకుంటూ. ★